ఆమె నేత్రాలు సజీవం

రాజేశ్వరి (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని చేపల వీధిలో నివాస ముంటున్న జామి రాజేశ్వరి (88) ఆదివారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ పరిధిలో ఉన్న మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం అందించారు. టెక్నీషియన్ సుజాత వచ్చి కార్నియా సేకరించారు. విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి వాటిని పంపించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి కుటుంబ సభ్యులు జామి దామోదరరావు, సంతోష్, ఎన్.వి. భాస్కరరావు, వారణాసి వంశీలను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు.

అమ్మ తినాలి.. బిడ్డ ఎదగాలి

- గర్భిణుల్లో పెరుగుతున్న రక్తహీనత
- తల్లి, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం
- 30శాతం మందికి ఇదే సమస్య



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గర్భిణిగా ఉన్నప్పుడు అమ్మ ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఎదుగుదల సాధ్యమవుతుంది. అందుకు అవసరమైన పౌష్టికాహారం తీసుకుంటేనే ఇది సాధ్యం.. పౌష్టికాహారం సక్రమంగా తీసుకోక పోవడం వల్ల రక్తహీనత దెబ్బ తీస్తోంది. జిల్లాలో వీరి సంఖ్య 30 శాతానికి పైగా ఉంటోంది. ప్రధానంగా గర్భిణులు సమతులాహారం తీసుకోకపోవడంతో తల్లీపిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోంది. గర్భిణుల్లో రక్తహీనత పసిప్రాయంలో పిల్లలపై ప్రభావం చూపుతోంది. మాతాశిశు సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ ద్వారా పలు పథకాలను అమలు చేస్తున్నారు. ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆచరణలో గ్రామీణ ప్రాంత గర్భిణుల్లో రక్తహీనత ఏటా పెరుగుతూనే ఉంది. సమతులాహారం తీసుకున్నప్పుడే రక్తహీనత తగ్గుతుంది. గర్భిణుల్లో ఆరోగ్యం మెరుగు పడి సుఖప్రసవంతో పాటు ఆరోగ్య వంతమైన పిల్లలు పుట్టేందుకు దోహదపడుతుంది.

గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ జననం వరకు మంచి ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్య వంతులైన బిడ్డలకు జన్మనిస్తారు. సరైన ఆహారం తీసుకోని గర్భిణులు రక్తహీనత బారినపడుతున్నారు. దీనివల్ల జిల్లాలో ప్రసూతి మరణాలు ఏటా సంభవిస్తున్నాయి. ప్రసవం కష్టంగా మారడం తల్లి బిడ్డల ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా మారుతోంది. కొందరు శారీరక లోపాలతో కూడిన పిల్లలు జన్మిస్తున్నారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లోపిస్తోంది. ఒందరైతే ప్రీమెచ్యూరిటీలో కాన్పు కలిగి బిడ్డ ప్రమాదస్థితికి చేరుతున్నారు. ఆస్పత్రుల్లో నెలల తరబడి తల్లి బిడ్డ వేరుగా గడపాల్సిన వస్తోంది. కొందరైతే ఇంక్యుబేసిన్‌లో బేబీని ఉంచి పెద్ద మొత్తంలో ప్రయివేటు ఆస్పత్రులకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. సమతుల ఆహారంపై ఐసిడిఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు పిల్లలకు ఎత్తు, బరువు, చుట్టు కొలతలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. తల్లులకు పిల్లల పోషణ, పెరుగుదలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైతే వైద్యానికి సిఫార్సు చేస్తున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సాంకేతిక విధానాలు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పిల్లల బరువు పెరుగుదలకు పౌష్టికాహారం అందజేయడంతో పాటు యోగా, వ్యాయామం చిన్నప్పటి నుంచే అలవాటు చేయాల్సి ఉంటుంది.

రక్తహీనతపై ప్రత్యేక దృష్టి

సమతులాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్య కరమైన జీవితం మన సొంతమవుతుంది. రోజువారి తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన ఉండటం లేదు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ జననం వరకు మంచి ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులైన బిడ్డలకు జన్మనిస్తారు. సరైన ఆహారం తీసుకోని గర్భిణులు రక్తహీనత బారినపడుతున్నారు. ప్రసవం కష్టంగా మారుతోంది. వారికి శారీరక లోపాలతో కూడిన పిల్లలు జన్మిస్తున్నారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లోపిస్తోంది. అందువల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల ఆహారం తీసుకోవాలి.

- బి.శాంతిశ్రీ, ఐసిడిఎస్ పీడీ

నిరంతర శ్రామికుడు పురుషోత్తం నాయుడు

ఆత్మీయ అభినందన సభలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం 42 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగిగానే కాక ఉద్యోగ సంఘ నాయకునిగా నిరంతరం శ్రమించి ఉద్యోగుల బాగోగులను కాపాడే వ్యక్తి చౌదరి పురుషోత్తంనాయుడుని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన నగరంలోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముందుగా పురుషోత్తం నాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ శ్రమతో పనిచేసి ప్రజల మనసును గెలుపొందిన వాడు నిజమైన కార్యసాధకుడని అన్నారు. వేలాది మంది ఉద్యోగుల మనసును గెలుచుకున్న పురుషోత్తం నాయుడు సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగానికి విరామం తీసుకున్న ఆయన తనతో కలిసి నడిచేందుకు వస్తాననడం ఆనందంగా ఉందన్నారు. ఆయనకున్న అనుభవం, కృషి, పట్టుదల తోడ్పడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగిగా నిర్దేశించిన కాలానికి విశ్రాంత ఉంటుందని, కానీ, సేవలకు విశ్రాంత ఉండదని అన్నారు. విలువైన ఆయన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుందన్నారు. సభలో ముందుగా పురుషోత్తం నాయుడు దంపతులను దుశ్శాలువ కప్పి సత్కరించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రాజకీయ నేపథ్యం ఉన్నా ఏనాడూ దర్పానికి పోని నిగర్వి పురుషోత్తం నాయుడు అని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో పనిచేసిన చౌదరి సత్యనారాయణ, శ్రీకాకుళోద్యమ నేపథ్యం ఉన్న తల్లిదండ్రులు చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మల వారసునిగా, ఉద్యోగ సంఘాల ఉద్యమ నేతగా పురుషోత్తం నాయుడు ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. సుదీర్ఘ కాలం పాటు ఉద్యోగుల సమస్యలపై ఆయన సాగించిన పోరాటం, సాధించిన విజయాలు మరువలేనివని అన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగుల మెప్పు పొంది వారి మనసుల్లో చిరస్థాయిగా నిలచి పోయిన వ్యక్తి అని కొనియాడారు. తన రాజకీయ జీవితంలో ఆయనతో తనకున్న బాంధవ్యాన్ని గుర్తు చేసుకున్నారు. కీర్తి ప్రతిష్టలు ఆశించకుండా నిరంతర శ్రామికునిగా పేరుతెచ్చుకున్నారన్నారు. మంత్రిగా ఉన్న కాలంలో ఉద్యోగ సంఘ నాయకత్వంలో ఉన్న ఆయన అనేక సమస్యలను తనవద్దకు తీసుకొచ్చి పరిష్కరించడానికి సహకరించాలన్నారు. ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం స్వాగతోపన్యసం చేశారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని బలోపేతం చేయడంలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర బాధ్యతల్లో ఉన్న ఆయన మాతృ సంస్థ వాణిజ్యపన్నుల శాఖకు, ఎన్‌జిఒ సంఘంలో ఉంటూ ఉద్యోగులకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ నూతన ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్, ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావు, టిడిపి నాయకులు చౌదరి నారాయణమూర్తి, వాణిజ్య పన్నులశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఓటమి నేర్పని పాఠాలు

వైసిపి ఆత్మీయ సమావేశంలో బయటపడిన లుకలుకలు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కవిటి

'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' అన్న చందంగా ఉంది ఇచ్ఛాపురం వైసిపి నాయకుల తీరు. నియోజకవర్గ వైసిపి నాయకుల తీరు చూస్తుంటే ఎదుర్కొన్న ఓటమి నుంచి పాఠాలు నేర్వడం మాట అటుంచి భవిష్యత్‌లో ఇచ్ఛాపురంలో వైసిపి పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా ఎన్నికల్లో ఓటమికి నియోజకవర్గ ఇన్‌ఛార్జిని పూర్తి బాధ్యులుగా చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి ఆలయంలో నిర్వహించిన వైసిపి విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుల ముందే ఏ హోదాలో ఇక్కడకు వచ్చావ్, ఇన్‌ఛార్జి ఎక్కడ అంటూ సాయిరాజ్‌ను ఓ నాయకుడు నిలదీశారు. కవిటి మండలం కళింగపట్నం సముద్రతీరంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశంలో ఇన్‌ఛార్జి విజయను మరో నాయకుడు బాహాటంగా విమర్శించడం పరిస్థితికి అద్దం పడుతోంది. దీంతో ఆత్మీయంగా కలుసుకుని చర్చించి పార్టీని బలోపేతం చేయడానికి నిర్వహించిన సమావేశం కాస్తా రచ్చకెక్కింది. కంచిలి మండలానికి చెందిన ఇప్పిలి కృష్ణారావు ఇన్‌ఛార్జి విజయను ఓటమికి బాధ్యులను చేస్తూ ఘాటుగా విమర్శించడంతో తీరంలో వాతావరణం వేడెక్కింది. జెడ్‌పి నుంచి నియోజకవర్గం వరకు జరుగుతున్న పరిణామాలకు ఆమెను బాధ్యులను చేయడమే కాకుండా టిడిపితో లోపాయికారి ఒప్పందమే ఓటమికి కారణమంటూ నిలదీశారు. దీంతో ఒకింత భావోద్వేగానికి గురైన చైర్‌పర్సన్ కృష్ణారావు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో జరుగుతున్న తీర్మానాలు జిల్లాస్థాయిలో ఎలా అపగలరని ప్రశ్నించారు. ఎన్నికల్లో స్వలాభం కోసం పనిచేసేవారే కానీ పార్టీ కోసం పనిచేసేవారు ఎవరంటూ నిలదీశారు. అందరి విషయాలు తనకు తెలుసని, జెడ్‌పి చైర్‌పర్సన్ హోదాలో కాని, నియోజకవర్గ ఇన్‌ఛార్జి హోదాలో కానీ ఎప్పుడూ తాను తన విధులు, బాధ్యతలు మరిచిపోలేదని స్పష్టం చేశారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకానికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ రేయింబవళ్లు కష్టపడినట్టు చెప్పారు. అండగా ఉండాల్సిన ఇటువంటి పరిస్థితుల్లో నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటమికి గల కారణాలు అన్వేషించకుండా అనైక్యతలు సృష్టించడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఇటువంటి లుకలుకలే నియోజకవర్గంలో పార్టీకి నష్టపరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వప్రయోజనాల కోసం ఎవరెన్ని విమర్శలు చేసినా తాను ప్రజలతోనే ఉంటానని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని కుండ బద్దలుకొట్టారు. దీంతో మిగతా నాయకులు సర్ధిచెప్పడంతో ఈ వివాదానికి తాత్కాలికంగా పులిస్టాఫ్ పడింది. అయితే అప్పటికే ఈ విషయం బయటకు పొక్కడంతో జరగాల్సిన నష్టం జరిగింది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అధినాయకుడు ఎన్ని అవకాశాలు ఇచ్చినా స్థానిక నాయకత్వ అనైక్యత, పార్టీ ప్రాధాన్యత కాకుండా వ్యక్తిగత ప్రాధాన్యత ఎక్కువగా ఉండడమే పెద్ద లోపమనేది ఈ సంఘటనతో మరోసారి స్పష్టమైంది. మొత్తానికి 'అంతనాడు లేదు.. ఇంతనాడు లేదు సంతనాడు కట్టింది ముంతంత కొప్పు' అన్న సామెతగా మిగిలింది ఆత్మీయ సమావేశం.

శిథిలావస్థలో సర్కారు భవనాలు

- భయాందోళనలో అధికారులు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో భాగంగా ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అధికారులను నియమించారు. అందుకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వ భవనాలు నిర్మించారు. కానీ, అక్కడితో పాలకులు, అధికారులు చేతులు దులుపుకోవడంతో సర్కార్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తమ విధులు నిర్వహించేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. తిత్లీ తుపాను సమయంలో మండల సమావేశ మందిరం పై కప్పు ఎగిరిపోయింది. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీలింగ్ పూర్తిగా నాశినమైంది. చాలా ఏళ్ల క్రితం నూతన భవనం నిర్మించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలాన్ని ఎల్ఐసి సంస్థకు అమ్మకం చేపట్టారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేస్తామని అనుకున్న సమయంలో నిధులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోవడంతో భవన నిర్మాణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిస్తే కార్యాలయంలో చాలా ప్రాంతాల్లో కారిపోతుందని అధికారులు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో అధికారులు భయపడుతున్నారు. ప్రస్తుతం భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయంతో పాటు సచివాలయం ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పలాస ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. శ్లాబ్ పిచ్చులు పడి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అధికారులు భయాందోళన చెందుతున్నారు. పాత భవనాలకు కాలం చెల్లినా ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేయకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనప్పటికీ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులకు పక్కా భవనాలు నిర్మించడంలో పాలకులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే చెప్పాలి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపి పాడైన భవనాలకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా నూతన భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న వ్యవసాయశాఖ కార్యాలయం

సుందర శ్రీకాకుళం దిశగా అడుగులు

- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- అక్రమ కట్టడాలపై నిఘా
- పాలిథిన్ వాడకంపై నిషేధం
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర కార్పొరేషన్ శ్రీకాకుళాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ డి.వి.వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. ప్రజల సహకారం ఉంటేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందుతోందని, ప్రజలు ఆలోచనలో మార్పు వస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందగలమని అన్నారు. శతశాతం పన్ను వసూళ్లపై ఇప్పటికే దృష్టి పెట్టామన్నారు. పారిశుధ్య నిర్వహణ పెద్ద సవాల్‌గా ఉందన్నారు. అందువల్ల ప్రతి ఇంట్లో చెత్తను ఎరువుగా మార్చుకునే ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. దీనివల్ల తడి, పొడి చెత్తలను ఇంటివద్దే ప్రతిఒక్కరూ వేరు చేసి పారిశుధ్య కార్మికులకు సహకారాన్ని అందిస్తున్నారన్నారు. పారిశుధ్య నిర్వహణలో గత ఏడాది జాతీయ స్థాయిలో ఉత్తమ నగరపాలక సంస్థగా అవార్డు దక్కించుకోగలిగామన్నారు. ఈ ఏడాది అదే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. మరోవైపు నగరపాలక పాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు నిధులు మంజూరైనట్టు తెలిపారు. దీనికి తోడు పెద్దఎత్తున రోడ్లు మరమ్మత్తు పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే పూడికతీత పనులు చేపట్టడంతో మురుగునీరు రోడ్లపైకి రాకుండా కాలువల్లో వెళ్లేందుకు వీలువుతోందన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే తక్షణమే కార్మికులు హాజరవుతున్నారని అన్నారు. నగరంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నగరపాలక సంస్థ పనితీరుపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? నగర సుందరీకరణకు తీసుకుంటున్న చర్యలేంటి?

నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి వీలుగా చర్యలు మొదలు పెట్టాం. శ్రీకాకుళం నగరం మధ్యలో నాగావళి నది ప్రవహిస్తుండడం ప్రజలు వేసవిలో సేదతీరేందుకు నదిపై ఉన్న వంతెనలు సహకరిస్తున్నాయి. వాటిని సుందరంగా తీర్చిదిద్దాలని భావించి ఇప్పటికే రంగులు వేశాం. కాలువలు నిర్మిస్తే ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించేందుకు వీలవుతుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల నిర్మాణం వల్ల కొంతమేరకు రూపాన్ని మార్చు కోగలిగింది. నగరపాలక సంస్థ పరిధిలో రెండుచోట్ల జాతీయ రహదారి ఫ్లైఓవర్లు ఉన్నాయి. వాటికి సైతం రంగులు వేయడంతో అక్కడ కొత్తదనం కనిపిస్తోంది. పచ్చని వాతావరణాన్ని తీసుకురావడానికి చర్యలు మొదలు పెట్టాం.

? పార్కుల అభివృద్ధి ఎలా సాగుతోంది?

నగరంలో గూనపాలెం, ఎల్‌బిఎస్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, హడ్కో కాలనీ, అఫీషియల్ కాలనీ పార్కు, గాంధీ పార్కు, రివర్ వ్యూ పార్కు, కార్గిల్ పార్కులను అభివృద్ధి చేశాం. పార్కుల పరిరక్షణ స్థానికులే పర్యవేక్షించడంతో మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. వారు విస్మరిస్తే పరిరక్షణ సాధ్యం కాదు. పెద్ద పార్కుల అభివృద్ధికి అనువైన స్థలాలు గుర్తించాల్సి ఉంది. పాత పార్కుల సుందరీకరణ చేపడుతున్నాం. నగర సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ... అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు.

? అక్రమ కట్టడాలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

నగరపాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నిర్మాణ రంగంలో ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా కట్టడానికి అనుమతులు ఇస్తున్నాం. అయితే కొందరు ప్రభుత్వ నిబంధనలను విస్మరించి నిర్మాణాలు కడుతున్నట్టు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. భవన నిర్మాణాలపై పురపాలకశాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. తమ పరిధిలోని భవనాలను సచివాలయాల ప్రణాళిక కార్యదర్శులు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో చర్యలు మొదలు పెడతారు. అనుమతుల్లేని నిర్మాణాలతో పాటు, తీసుకున్న అనుమతులకు భిన్నంగా కట్టడాలు ఉన్నా వాటిని గుర్తించి చర్యలు చేపట్టేందుకు వీలుగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పర్యవేక్షణకు నిశిత పరిశీలనకు అవకాశాలు మెరుగుపడ్డాయి. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసేందుకు పురపాలకశాఖ అనథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్ ఐడెంటిఫికేషన్ అండ్ మానిటరింగ్ సిస్టం (యుసిఐఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. భవనాలు, బహుళ అంతస్తుల సముదాయాలను యాప్‌లో పొందుపర్చే ప్రక్రియ కొనసాగుతోంది. పట్టణ సచివాలయాల్లోని వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు ఈ బాధ్యతలను అప్పగించాం.

? తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు ఏమిటి?

నాగావళి నదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పుడు తాగునీటి కొరత ఉండదు. అందుకు తగ్గట్టు రక్షిత తాగునీటి పథకాలు పనిచేస్తున్నాయి. అయితే వేసవిలో నదిలో నీరు అడుగంటినప్పుడు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీని నుంచి బయటపడేందుకు నాగావళి నదిలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి నది అంతర్భాగంలో డైక్ నిర్మిస్తున్నాం. దీంతో పాటు వరద నుంచి కాపాడేందుకు రూ.62 లక్షలతో నీటిపారుదలశాఖ నిర్మిస్తున్న రింగ్ బండ్ పనులు చేపట్టాం.

? ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధం ఎలా కొనసాగుతోంది?

నగరంలో శతశాతం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాం. ఇప్పటికే పాలిథిన్ సంచుల వినియోగంపై పెద్దఎత్తున ప్రచారం, అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం, విక్రయదారులతో సమావేశాన్ని నిర్వహించాం. అలాగే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిలుపుదల చేస్తున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిషేధాన్ని తప్పక అమలు చేస్తున్నాం. దీనికి ప్రజల సహకారం అవసరం.

సస్పెన్షన్‌తో సరిపెడతారా?

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి 8 వార్డు చౌక ధరల దుకాణం డీలర్ గొండేల సుజాతని డీలర్ షిప్ నుంచి సస్పెండ్ చేస్తూ... ఆ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మరలా నూతనంగా డీలర్‌ని నియమించే వరకు ఆ బాధ్యతలను పక్క ఉన్న 5 వార్డు డీలర్ వసంత్‌కుమార్‌కి అప్పగించారు. డీలర్ సుజాత టెక్కలి సర్పంచ్‌గా నియామకం కావడంతో ఒకే వ్యక్తి రెండు పదవులు చేపట్టకూడదనే వాదనతో గత నెల టెక్కలి రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదేశాల మేరకు సుజాత సర్పంచ్ పదవిని వదులుకున్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందించారు. అయితే సర్పంచ్‌గా, డీలర్‌గా రెండు పదవులు చేపడుతూ చట్టాన్ని పక్కదారి పట్టించారనే వాదనతో డీలర్‌గా కూడా సస్పెండ్ చేశారు. దీంతో వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారడంతో సద్దుమణిగిస్తారా? భవిష్యత్‌లో చర్యలు కూడా తీసుకుంటారా? అనే సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. గడచిన ప్రభుత్వంలో జరిగిన ఈ తప్పిదాన్ని రెవెన్యూ అధికారులు కప్పిపుచ్చారు. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల తర్వాత బయటపెట్టడంలోని ఆంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా జరిగిన తప్పిదంపై అధికారులు తీసుకునే చర్యల్లో భాగంగా రికవరీలు ఉంటాయా? అనేది తెలియాల్సి ఉంది. డీలర్‌గా, సర్పంచ్‌గా ఉన్న సమయంలో తీసుకున్న జీతాలను మరలా రికవరీ చేయిస్తారనే వాదన వినిపిస్తుంది. ఏదేమైనా టెక్కలి 8 వార్డు డీలర్ సుజాత సస్పెండ్ వ్యవహారం చర్చనీయాంశంగా మారుతుంది.

యువకునిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలోని గేటు ప్రాంతంలోని రెల్లి వీధికి చెందిన కోటిపల్లి రాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు ఆదివారం తెలిపారు. అదేవీధికి చెందిన బాలికకు రాజు మాయ మాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేశాడని అన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బాలిక గేటులోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతుందన్నారు. రెండేళ్లుగా మాయమాటలు చెప్పి లోబరుచుకొని ఆమెతో శారీరకంగా కలిసి గర్భవతిని చేసినట్లు బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. బాలిక తల్లి ఒక పాఠశాలలో ఆయాగా, తండ్రి ప్రయివేటు ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నారని అన్నారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజుపై ఫొక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్. వివేకానంద దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
S.O.P. No.10/2024.

Between:
Smt. Enda Uma Maheswari...Petitioner.
And:
Kum. Enda Gayathri etc.,..Respondents.

Take notice that the above succession petition filed by the petitioner for granting Succession Certificate in favour of the petitioner and the 1st respondent for realization of the Terminal benefits amount i.e. Gratuity of Rs.2,36,987/- and also a sum of Rs. 12,920/- per month towards family pension to the petitioner alone from the 2nd respondent i.e. Deputy Director, Animal Husbandry, Srikakulam, as mentioned in the petition schedule and that the above case is stands posted to 29.01.2025, before the above Court. If anybody got any objection for issuance of certificate in favour of the petitioner and the 1st respondent, please attend the Honourable Court on **29.01.2025 at 10.30 a.m.,** failing which the matter will be decided in your absence.

N.RAMESH KUMAR
ADVOCATE
MIG-1-180, PHASE-11,
Vuda Colony, Cantonment
VIZIANAGARAM

స్థూపం వద్ద మాట్లాడుతున్న ప్రకాష్

పోరాటాలకు స్ఫూర్తి చిలకమ్మ

ప్రజాశక్తి- మందస

సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించడమే శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఆదివాసీ వీరవనిత సవర చిలకమ్మకు అర్పించే నిజమైన నివాళి అని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. మండలంలోని కొండలోగాంలో చిలకమ్మ స్మారక స్థూపం వద్ద ఆదివారం చిలకమ్మ 29వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేసి ఆదివాసీల హక్కులను కలరాయడానికే పూనుకుంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సిపిఐ (ఎంఎల్) న్యూమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడి నెలకొంది. ఆనాటి విశ్రాంతి ఉపాధ్యాయులను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు చక్రపాణి, సత్యనారాయణ, ఎల్‌కెఎం నరసింహమూర్తి, మహేష్, హెచ్‌ఎం చల్ల లక్ష్మీనారాయణ పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మానవతా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. పాత జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు తమ హావాభావాలతో నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆట, పాటలతో సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఎక్కువ మంది హాజరు కావడంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా క్విజ్, డాన్స్, ఇతర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి విశ్రాంతి ఉపాధ్యాయులు బహుమతులు, మెమోంటోలు అందజేశారు.

విశిష్ట వ్యక్తుల జాబితాలో అనిల్ చంద్ర పునేఠాకు చోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అనీల్ చంద్ర పునీఠ

ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత ప్రచురణ సంస్థ హిత మెయిల్ రూపొందించిన ప్రత్యేక సంచికలో విశిష్ట వ్యక్తుల జాబితాలో శ్రీకాకుళం జిల్లా పూర్వ కలెక్టర్ అనీల్ చంద్రపునేఠాకు చోటుదక్కింది. దేశవ్యాప్తంగా 50 మంది విశిష్ట వ్యక్తులను గుర్తిస్తే వారిలో పునీఠ 41వ వ్యక్తిగా గుర్తింపు పొందారు. మొదటి వ్యక్తిగా ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ చోటు దక్కించుకున్నారు. దేశంలో వివిధ రంగాల్లో సేవలందించడంతో పాటు నిజాయతీగల వ్యక్తిత్వం ఉన్న వారికి ఈ గుర్తింపు దక్కింది. జిల్లాలో ఆయన కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మారుమూల పల్లెల్లో సైతం ప్రజలకు దగ్గరగా పనిచేసి మెప్పు పొందారు. సామాన్య వ్యక్తులతో నేటికీ ఆయన సత్సంబంధాలు కొనసాగిస్తున్నారంటే జిల్లా ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆయన ఎంపికపై డిప్యూటీ కలెక్టర్ బి.దయానిధి, విశ్రాంత జెసి పి.రజనీకాంతరావు, కె.వి.రాధాప్రసాద్, నటుకుల మోహన్ తది తరులు హర్షం వ్యక్తం చేశారు.

9 నుంచి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 9 నుంచి ఎపిఎల్ సూపర్‌సిక్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎపిఎల్ కమిటీసభ్యులు సనపల మోహన్ సురేష్, కామినేని సంతోష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్ (తంబి) ఆధ్వర్యంలో నిర్వహించబడునన్నారు. ఈ టోర్నమెంట్ ఆరు ఓవర్లు, 8 మంది ప్లేయర్స్‌తో పాల్గొనాల్సి ఉంటుందని, పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ రూ.2 వేలు, బెస్ట్ బౌలర్ రూ.2 వేలు నగదు ఇవ్వబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9491533123 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికైన సభ్యులు

కన్స్యూమర్ కో-ఆపరేటివ్ సెంట్రల్‌స్టోర్ అధ్యక్షునిగా అప్పలసయన్న

కోటబొమ్మాళి: కేంద్ర, రాష్ట్ర ఆదేశాల మేరకు కోటబొమ్మాళి కన్స్యూమర్ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్ (సిసిసి స్టోర్స్) ఎన్నికలు స్థానిక పిఎసిఎస్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా శ్రీకాకుళానికి డిప్యూటీ రిజిస్టర్, డివిజనల్ కో-ఆపరేటర్ అధికారి బి.మురళీకృష్ణ వ్యవహరించారు. అనంతరం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోరాడ అప్పలసయన్న, ఉపాధ్యక్షులు లొట్టి రామారావుతో పాటు పలువురు డైరెక్టర్లను, మెంబర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, పట్టణ అధ్యక్షులు కోరాడ గోవింద్, మాజీ ఉపసర్పంచ్ సకలభక్తుల సునీత రామకుమార్, స్కూల్ చైర్మన్ బోయిన వెంకటరమణ, కోరాడ చిన్నగోవింద్, సకలభక్తుల వైకుంఠం, కోరాడ ప్రతాప్ పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయినేజీ పనులు

మెళియాపుట్టి : మండలంలోని చాపర పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రెయినేజీ పనులను సర్పంచ్ బోసి రామారావు ఆదివారం ప్రారంభించారు. పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రామారావు

అధిక లోడ్లతో అవస్థలు

- భయాందోళనలో ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

అధిక లోడ్లతో రాకపోకలు కొన సాగిస్తున్న వాహనాలతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అటు శ్రీకాకుళం ఇటు పాలకొండ ప్రధాన రహదారిపై అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి తదితర మండలాల్లో వరికోతలు పూర్తికావడంతో వరిగడ్డి ట్రాక్టర్లతో ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. అయితే ఆయా ట్రాక్టర్లు అధికలోడు చేయడంతో రహదారి మొత్తం గడ్డి ట్రాక్టర్ ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాల రాకపోకలు గుర్తించక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న గడ్డి ట్రాక్టర్‌ను గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. మండలంలోని లాభాం, మామిడివలస, బూర్జ, డొంకలపర్త, అన్నంపేట తదితర గ్రామాల నుంచి ప్రధాన రహదారిపై వెళ్తుండడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి చెరుకు లోడ్లు సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనలకు గురవుతున్నామని పోతున్నారు.

గడ్డి ట్రాక్టర్లతో అవస్థలు పడుతున్న వాహనదారులు

మర్రిపాడు కూడలి వద్ద లారీలోకి ఎక్కిస్తున్న జారిపడిన చెరకు

బూర్జ కూడలి వద్ద అధిక లోడుతో వెళ్తున్న గడ్డి ట్రాక్టర్

చోద్యం చూస్తున్న అధికారులు

రాత్రి, పగలు తేడా లేకుండా చెరుకు గడ్డి అధికలోడ్లతో ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుంటే నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధికలోడ్లతో వాహనాలు నడుపుతున్న వాహనాలకు అడ్డుకట్ట వేయాలని అలాగే ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి అందజేత

పోలాకి: మెరుగైన వైద్య అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు మండలం వెంకటాపురానికి చెందిన పురుబోయిన శ్రీను భవనంపై నుంచి పడిపోయి వెన్నెముక దెబ్బతింది. ఆపరేషన్ కోసం ఆయన సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆపరేషన్ కోసం సిఎం సహాయనిధి కింద రూ.70,700 చెక్కు, పోలాకి మండలం వనవిష్ణుపురంలో ఇటీవల చోటు చేసుకున్న కొట్లాటలో మృతి చెందిన పాలిన వీరస్వామి కుటుంబానికి టిడిపి తరుపున రూ.2 లక్షల చెక్కును కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పల నాయుడు, బైరి భాస్కరరావు, డోల ప్రసాదరావు, జి.ఎర్రయ్య, చింతు కర్రెన్న, ఎం.వైకుంఠరావు, కె.రామారావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల పరామర్శ

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో తోపులాటలో ఎంపిటిసి సభ్యుడు బత్సల సుధాకర్ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు సీతానగరంలోని ఆయన ఇంటికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక దాడులకు దిగడం సరికాదని వైసిపి నాయకులు విమర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి భర్త మేరుగు అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కిల్లి గోవిందరావు, వైస్ ఎంపిపి ప్రతినిధులు నక్క భీమారావు, రామకృష్ణ, బాబూరావు, సర్పంచ్ నక్కెట్ల నరేష్, పరపటి శ్రీనివాస్‌రెడ్డి, లింగరాజు, అప్పన్న, పాపారావు, కొన్న శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రతిభా పరీక్ష

టెక్కలి : మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యాన స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నాగభూషణం ప్రారంభించారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానాన్ని సీతాపురం పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానాన్ని లింగాలవలస పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వివిధ పాఠశాలల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న హనుమంతు శివానంద్, సకాల బత్తుల శ్రీనివాసరావు, అప్పారావు, చిన్నారావురెడ్డి పాల్గొన్నారు.

పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

మహాసభకు తరలివెళ్లిన నాయకులు

కొత్తూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 వసంతాల స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో పిఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ప్రారంభించారు. మండలం నుంచి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయ్‌కుమార్, వి.మధుసూదనరావు, సీనియర్ నాయకులు ఆర్.ఆర్.కొండలరావు, పి.వెంకటరమణ, బాల కృష్ణ, గోవిందరావు, దినేష్, భద్రయ్య, భరత్, సంతోష్ కుమార్, శోభన్‌బాబు, ఎన్.లక్ష్మీనారాయన, టి.రవి, రామ కృష్ణారావు, సంగమేష్, డి.రాంబాబు, టి.గణపతి పాల్గొన్నారు.

సొండీల ఆత్మీయ కలయిక

వజ్రపుకొత్తూరు: మండలంలోని సొండీల సంక్షేమశాఖ ఆధ్వర్యాన పూండిలో ఆదివారం వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోండిల సంఘం అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి బెహరా రాజారావు, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు షావుకారు దివాకర్ తదితరులు పాల్గొన్నారు. సొండీలను ఒబిసి జాబితాలో చేర్చేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఎన్నిక

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి శ్రీరామ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షునిగా గుంటు గురునాథం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శివసాగర్ తీరంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద కమిటీ ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా కె.ఎల్.నారాయణ, కార్యదర్శిగా మడ్డు రాఘవరావు, జాయింట్ కార్యదర్శిగా జయశంకర్, కోశాధికారిగా మురుపల్లి రవీంద్రలను ఎన్నుకున్నారు. సొసైటీలో సభ్యుల సంక్షేమానికి సహకారాలు అందిస్తామని గురునాథం తెలిపారు.

తూర్పుకాపుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

తూర్పుకాపు అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయన అన్నారు. మండల సమీపంలోని పోర్టు రోడ్డులో ఆదివారం నిర్వహించిన తూర్పుకాపుల ఆత్మీయ కలయిక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తరగతి అభివృద్ధికి నోచుకోవాలి తప్ప ఎదుటి వారిని కించపరిచే విధంగా ఉండరాదన్నారు. రాజకీయాలకు అతీతంగా తరగతులు ఉండాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పెద్దపాడులో తూర్పు కాపులకు స్థలం కేటాయించేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు చైర్మన్ పాలవలస ఎస్.ఎస్.శ్రీని, కరిమి రాజేశ్వరరావు, మామిడి శ్రీకాంత్, కిమిడి రామ్మల్లికనాయుడు, మోదుగువలస దుర్యోధనరావు, మోదిగువలస గణపతరావు, పోలాకి చంద్రశేఖరరావు, పోలాకి షణ్ముఖరావు, రౌతు జైమోహన్, మడపాన తిరుపతిరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

డిసిసి అధ్యక్షులు కృష్ణారావు పరామర్శ

నర్సింహులును పరామర్శిస్తున్న కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేపల్లి నరసింహులును డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని హడ్కోకాలనీలో నివాసముంటున్న ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆయన పార్టీ అభివృద్ధికి సీనియర్ నాయకులుగా తమ అనుభవాలు, సూచనలు, సలహాలు అందించాలని కోరారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో పూర్తి భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ప్రస్తుత రాజకీయాలతో పాటు కాంగ్రెస్ పార్టీ స్థితిగతులను ఆయనకు వివరించారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న వైఖరి, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అగౌరవ పరుస్తున్న తీరును నర్సింహులు తప్పుపట్టారు. కార్యక్రమంలో ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, షాహిద్ ఉల్లా ఖాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, చాన్ బాషా పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత రాణించాలంటే తాను ఎన్నుకున్న వృత్తి, ఉద్యోగాల్లోనూ ఇతర రంగాల్లో నైపుణ్యత కలిగి ఉండాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని టూటౌన్ సిఐ ఈశ్వరరావు అన్నారు. సాయిబాబా హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పెన్‌కాక్ సెలాట్, కిక్ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతలను ఆయన అభినందించారు. నగరంలోని మున్సిపల్ కళ్యాణ మండపంలో ఆదివారం అభినందన కార్యక్రమం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహధారుడ్యం, ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్, జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ప్రముఖ న్యాయవాది కొంక్యాన సుభాష్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొన్న మధుసూదనరావు, పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.దయామయి, సాయిబాబాస్ హేమంత్ మార్షల్ ఆర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

విద్యార్థులతో సిఐ ఈశ్వరరావు

నిరాధార ఆరోపణలు మానుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ఐదేళ్లపాటు చేతగాని పాలనతో పరిపాలించిన వైసిపికి గడచిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ నేటికీ నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టడం మానుకోవడం లేదని రాష్ట్ర టిడిపి న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు నూక అప్పల సూరన్నాయుడు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కనీసం వార్డు మెంబర్‌గా గెలవని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2019 - 24 మధ్య అర్హత కలిగి ఉపాధి పొందుతున్న వివిధ శాఖల్లోని 150 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించిన వైసిపి నాయకులు నేడు పత్రికా విలేకరుల సమావేశం పెట్టి చిరు ఉద్యోగులను తొలగిస్తున్నారని మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. వైసిపి తాటాకు చప్పుళ్లకు కూటమి నాయకులు భయపడేది లేదని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వంలో మార్కెటింగ్, మున్సిపల్, వెలుగు, మండల పరిషత్ తదితర శాఖల్లో తొలగించిన ఉద్యోగుల విషయాన్ని మరచిపోయినట్లు ఉన్నారని ఒకసారి శాఖల వారిగా వివరాలను తెప్పించుకొని మననం చేసుకోవాలని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి బోర గోవిందరావు, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు సువ్వారి మురళీధరరావు, బిసిసెల్ అధ్యక్షులు తంగి గురయ్య, కోరుకొండ రమణమూర్తి పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని చెప్పి ఆరునెలలు గడిచిన తర్వాత ఉపాధ్యాయులకు జీతాలు సక్రమంగా జమ చేయడం లేదని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ పేర్కొన్నారు. నగరంలోని క్రాంతిభవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో తేదీ వచ్చినా ఇంతవరకు ఉపాధ్యాయుల జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం తరహాలోనే సకాలంలో జీతాలు చెల్లించకపోతే ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని నమ్మారని, అయితే ఆరునెలలు గడచినా ఏఒక్క సమస్య పరిష్కరించకపోగా సకాలంలో జీతాలు సైతం చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలపై ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. డిఎ విడుదల, 12వ పిఆర్‌సి అమలుపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మెరుగైన పెన్షన్ పథకాన్ని తెస్తామని హామీఇచ్చి ఇప్పుడు దానిపై కూడా మాట్లాడడం లేదన్నారు. రాష్ట్రంలో 12,611 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయని ఒక్క ఉపాధ్యాయుడితో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, ఎ.జగన్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణ

పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల సమీపం వద్ద ఆదివారం మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. కోటబొమ్మాళి మండలం సుబ్బరాయుడుపేటకు చెందిన బాడాన రవణమ్మ తన భర్తతో కలిసి కోసమాల బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ మహిళ మెడలోని మూడు తులాల పుస్తెలతాడు తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కణితిఊరుకు చెందిన గిన్ని మల్లేశ్వరరావు చెందిన రెండు వరి చేను కుప్పలు శనివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఆహుతయ్యాయి. మల్లేశ్వరరావు సన్నకారు రైతు. ఆయన 6 నెలలు కష్టపడి పండించిన పంట చేతికొచ్చింది. రెండెకరాల పంట కుప్ప వేశారు. నూరుపు మిషన్ పెట్టింటేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో వరి కుప్పలు దగ్ధమయ్యాయి. రాత్రి మంటలను చూసిన గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. టెక్కలి అగ్నిమాపక అధికారి బి.సూర్యారావు, సిబ్బంది మధుసూదనరావు, కిషోర్, వాసుదేవు, పాడురంగారావులు శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధితుడు ఆరోపించారు. కళ్ల ముందు చేతికి వచ్చిన పంట బూడిద కావడం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించే 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు మూడు రోజులుగా నిర్వమించిన శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఎఇఎంఎస్ఇఒ నవీన్ పర్యవేక్షణలో ఆన్ జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ ఈ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని 108 ఇఎంటిలు పాల్గొన్నారు.

బౌద్ధ స్థూపాల వద్ద ఉపాధ్యాయులతో విద్యార్థులు

విద్యార్థుల విజ్ఞానయాత్ర

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ గూనంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుగుబల్లి మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు విజ్ఞాన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల నైరా, శాలిహుండం బౌద్ధ స్థూపాలు, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, కళింగపట్నం బీచ్, శ్రీకూర్మం తదితర ప్రదేశాలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చుక్కలు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా న్యాయవాదుల పిక్నిక్

ఆమదాలవలస : మండలంలోని గాజుల కొల్లివలస సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యంలో న్యాయవాదుల పిక్నిక్ ఆదివారం నిర్వహించారు. నిత్యం కోర్టులో బిజీబిజీగా ఉండే న్యాయవాదులు ఉల్లాసంగా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని పలు సినిమా పాటలకు నృత్యాలు చేశారు. చిన్న, పెద్ద అంతా కలిసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం అందరూ కలిసి వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని అన్నం నాయుడు, పైడి వరహా నరసింహం, బూర్లె సీతారాం, కూన గణపతి పాల్గొన్నారు.

ఊడికలపాడులో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కోటబొమ్మాళి: మండలంలోని 38 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని పల్లెల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఆదేశాల మేరకు కార్యదర్శులు, సర్పంచ్‌లు స్పందించి పారిశుధ్యంపై దృష్టిసారించారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, అప్పల స్వామిల ఆధ్వర్యాన రోడ్లను శుభ్రపరిచి, డ్రెయినేజీల్లో చెత్తా చెదారాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే కన్నేవలస, సరియాపల్లి తదితర పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ పనులను ఇఒపిఆర్‌డి జె.ఆనందరావు పరిశీలించి సం క్రాంతి సందర్భంగా పనులు చేపట్టాలని సూచించారు.

సంక్రాంతిపై చర్చాగోష్టి

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి వేడుకలపై అవగాహనతో పాటు పిల్లల్లో వినోదాన్ని పంచేందుకు వీలుగా బాలల లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యాన చర్చా గోష్టి నిర్వహించారు. ఆదివారం నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన ఈ చర్చాగోష్టిలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు లోకనాథం నందికేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే రీతిలో సంక్రాంతి వేడుకలను జరుపుకుంటామన్నారు. నేటి ఆధునిక కాలంలో నాటి సంస్కృతులను పిల్లలకు తెలియ జెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బిఎంఎస్ పట్నాయక్, హరి సత్య నారాయణ, డ్రాయింగ్ టీచర్ సాయి ప్రసాద్, చోడవరం ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు అందర్ని ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలతో పాటు పాల్గొన్న పిల్లలకు బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న నందికేశ్వరరావు